క్లుప్తంగా

సీఎం జగన్‌తో ద్వారంపూడి భేటీ


సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని కలసిన ఎమ్మెల్యే ద్వారంపూడి, వీరభద్రారెడ్డి

కాకినాడ: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర రెడ్డి, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ద్వారంపూడి వీరభద్రారెడ్డి మంగళవారం అమరావతిలో కలిశారు. ఇటీవల చోటు చేసుకున్న రాజకీయ పరిణామాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లినట్టు ఎమ్మెల్యే ద్వారంపూడి తెలిపారు. కాకినాడ నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులను వివరించి, నిధులు విడుదల చేయాల్సిందిగా కోరామని చెప్పారు.

కుటుంబ నియంత్రణ పద్ధతులు పాటిద్దాం

కాకినాడ సిటీ: ప్రపంచ జనాభా దినోత్సవాన్ని కలెక్టరేట్ కోర్టు హాలులో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి ఆర్.రమేష్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. స్వాతంత్ర్య ఆజాదీ కా అమృత్ మహోత్సవం సందర్భంగా సంతోషం, శ్రేయస్సు కోసం కుటుంబ నియంత్రణ పద్ధతులను పాటిద్దామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ కృతికా శుక్లా మాట్లాడుతూ జనాభా నియంత్రణ ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. ఈ దినోత్సవం సందర్భంగా ఈనెల 7వ తేదీన తీసిన లక్కీ డిప్ ద్వారా వచ్చిన విజేతలకు చెక్కుల ద్వారా నగదు బహుమతులు అందజేశారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు కె.సత్యనారాయణ, డాక్టర్ విష్ణువర్ధని, ప్రభాకర్ గిరి గణేష్, వీఎస్ వర్మ, పి సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా పరిశీలన


శ్రీనివాసనగర్‌లో ఓటర్ల జాబితాను పరిశీలిస్తున్న ఆర్డీవో సత్యనారాయణ

కాకినాడ రూరల్: మండలంలోని ఇంద్రపాలెంలో నియోజకవర్గ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, ఆర్డీఓ ఎస్‌వీవీ సత్యనారాయణ మంగళవారం ఓటర్ల జాబితాను పరిశీలించారు. ఆ పంచాయతీ పరిధిలోని శ్రీనివాసనగర్‌లో 138 స్టేషన్ పరిధిలో 1–47 డోర్ నెంబర్‌లో 10 కంటే ఎక్కువ ఓట్లు నమోదైన నేపథ్యంలో ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు సంబంధిత ఓటర్లకు నోటీసులు జారీ చేసి దోష రహిత ఓటర్ల జాబితా రూపకల్పనకు చర్యలు తీసుకోవాలని ఆదేశించామన్నారు. ఆర్డీవో వెంట తహసీల్దార్ వి.మురార్జీ, గ్రామ రెవెన్యూ అధికారులు, బూత్ అధికారులు పాల్గొన్నారు.

ముగిసిన అంగన్‌వాడీ నిరసన

కాకినాడ సిటీ: కలెక్టరేట్ వద్ద హామీలు అమలు చేయాలని కోరతూ అంగన్‌వాడీలు తలపెట్టిన 36 గంటల నిరసన మంగళవారం ముగిసింది. యూనియన్ నాయకులు జి.బేబీరాణి, చంద్రావతి, చెక్కల రాజ్‌కుమార్, దువ్వా శేషుబాబ్జీ తదితరులు పాల్గొన్నారు

లయన్స్ సంకల్ప సేవలు మరువలేనివి


దివ్యాంగునికి ట్రైసికిల్ అందిస్తున్న లయన్స్ క్లబ్ సంకల్ప సభ్యులు

బోట్‌క్లబ్: లయన్స్ క్లబ్ సంకల్ప అందిస్తున్న సేవలు మరువలేనివని క్లబ్ మాజీ గవర్నర్ బాదం బాలకృష్ణ అన్నారు. స్థానిక రామారావుపేట లయన్స్ క్లబ్ హాల్‌లో మంగళవారం లింగంపర్తికి చెందిన దివ్యాంగుడికి క్లబ్ సభ్యురాలు పూజ ట్రైసికిల్ అందించారు. క్లబ్ అధ్యక్షురాలు మెట్టా రాధ, సభ్యులు సామా రాజేశ్వరి, రాజీ, పున్నమరాజు దేవి, సుజాత, రూప పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన

కాకినాడ: నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు మంగళవారం పెద్ద మార్కెట్ సెంటర్, చిట్టూరి వారివీధి, మంత్రిప్రగడవారి వీధి ప్రాంతాల్లో పారిశుధ్య పనులను తనిఖీ చేశారు. కొన్నిచోట్ల చెత్త తొలగింపులో సిబ్బంది అలసత్వాన్ని గుర్తించి సిబ్బందికి సూచనలిచ్చారు. ఓ ప్రాంతంలో రహదారిని ఆక్రమించి బొగ్గుమూటలు వేయడంపై తక్షణమే వాటిని తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాంబాబు, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

వృద్ధాశ్రమంలో పండ్లు పంపిణీ

కరప: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర రెండు వేల కిలోమీటర్లు పూర్తయిన సందర్భంగా నడకుదురులోని జనావళి వృద్ధుల అనాథాశ్రమంలో మంగళవారం టీడీపీ నాయకులు స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. మండలపార్టీ అధ్యక్షుడు దేవు వెంకటేశ్వరరావు, డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు, కె.నాగబాబు పాల్గొన్నారు.

ఇంటిలో మనిషై.. ఇతోధిక సేవచేస్తూ..

కాకినాడ/కాకినాడ కల్చరల్/కరప/కాకినాడ రూరల్/బోట్‌క్లబ్/బాలాజీచెరువు: ప్రభుత్వానికి సంబంధించి ఏ పని కావాలన్నా ఆ కార్యాలయం చుట్టూ తిరగాల్సిన పరిస్థితి. తిరిగినా సదరు అధికారులు ఉంటారో ఉండరో తెలియని పరిస్థితి. ఇంట్లోని పెద్దకో, లేదా బాధ్యతగల పెద్ద కొడుకో, కూతురో ఆ భారాన్ని తలకెత్తుకుని ఆయా కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేది. ఈ పరిస్థితుల్లో జగనన్న ప్రభుత్వం వచ్చాక వలంటీర్ వ్యవస్థను తీసుకురావడం, వలంటీర్‌కు ఓ 50 ఇళ్ల బాధ్యతను అప్పజెప్పడం తెలిసిందే. ఈ క్రమంలో వలంటీర్లు ఆయా ఇళ్లలో ఒక ఇంటి సభ్యుడిగా చేదోడు వాదోడుగా నిలుస్తూ ప్రభుత్వ పథకాలను ఇళ్లలోని లబ్ధిదారులకు అందజేస్తూ వారి మన్ననలు పొందుతున్నారు. ఇటువంటి మహోన్నత సేవలపై రాజకీయ లబ్ధి కోసం జనసేన అధినేత పవన్ కల్యాణ్ చేసిన తీవ్రమైన వ్యాఖ్యలను స్వయంగా గృహస్తులే అసహ్యించుకుంటున్నారు. తమకు ఇంత సేవ చేస్తున్నవారిని ఎలా అనాలనిపించిందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వలంటీర్ల ద్వారా అందుతున్న సేవలను వారే వివరిస్తూ పవన్‌కల్యాణ్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కాలు కదపనీయకుండా సేవ చేశారు


స్థలం పట్టా చూపిస్తున్న సలాది వెంకటలక్ష్మి

మా ఊరు కరప. నా భర్త నూకరాజు రెండేళ్ల క్రిందట ప్రమాదవశాత్తు మరణించారు. ముఖ్యమంత్రి జగనన్న అమలుచేస్తున్న పథకాల ద్వారా కుమార్తె శివానిని ఇంటర్మీడియట్, కుమారుడు కాశీకృష్ణను పదో తరగతి చదివించుకుంటున్నా. మా వలంటీర్ దేవు తమాదేవి నిత్యం ఇంటికి వచ్చి ప్రభుత్వ పథకాలు వివరిస్తూ తమకు ఉపయోగపడేవాటిపై అవగాహన కల్పించేవారు. నా భర్త డెడ్ సర్టిఫికెట్, ప్రమాద బీమా రూ.2 లక్షలు ఇప్పించారు. ప్రతి నెలా ఒకటో తారీఖున తెల్లవారకుండానే పింఛను ఇస్తారు. సొంతింటి కోసం స్థలం ఇప్పించారు. ఆమే అన్నీ చేసి ఇళ్ల స్థలం పట్టా, గృహ రుణం మంజూరయ్యాయని చేతిలో పెడితే ఆశ్చర్యపోయాను. కరోనా కాలంలో నిత్యం ఇంటికి వచ్చి మాస్కులు ఇచ్చేవారు. నా భర్త బతికున్నపుడు వలంటీరే కౌలుగుర్తింపు కార్డు రాయించి, రైతు భరోసా, పంటల బీమా వచ్చేలా చేశారు. ఎప్పటికప్పుడు చేదోడు, వాదోడుగా ఉంటూ, సేవలందిస్తున్న వలంటీర్లను పవన్‌కళ్యాణ్ విమర్శించడం బాధనిపించింది. వలంటీర్ల సేవలు ఎప్పటికీ మరువలేం.

–సలాది వెంకటలక్ష్మి, కరప

మా కుటుంబానికి చేయూతనిచ్చారు



రోజు కూలీ ద్వారా దుకాణాల్లో పనిచేసుకునే నాకు వలంటీర్ నాగేంద్రకుమార్ వైఎస్సార్ చేయూత పథకంపై అవగాహన కల్పించి దరఖాస్తు చేయించారు. అవసరమైన పత్రాలు తీసుకువెళ్లి ఆ పథకం ద్వారా రూ.18 వేలు ఇప్పించారు. దానితో ఓ చిన్న టిఫిన్ సెంటర్ పెట్టుకుని కుటుంబాన్ని పోషించుకుంటున్నాను. రిక్షా తొక్కి ఉపాధి పొందుతున్న నా భర్తకు ఆయనే వృద్ధాప్య పింఛను ఇప్పించారు. వీటికి తోడు నవరత్నాలు పథకంలో భాగంగా ఇంటి స్థలం ఇప్పించారు. ఇలా జగనన్న ప్రభుత్వంలో తమకు అర్హమైన పథకాలను ఇప్పించి చేదోడువాదోడుగా నిలుస్తున్నాడు. ఆయన సేవలు ఎన్నటికీ మరువలేము.

– దువ్వి చిన్న, రామకృష్ణారావుపేట, కాకినాడ

చేయూతతో ఆదుకున్నారు



నా పేరు షేక్ బీబీ. సూర్యనారాయణపురంలోని మల్లిపాముల వారి వీధిలో ఉంటున్నా. పేదరికంలో జీవిస్తున్న నాకు మా వలంటీర్ రాఘవలక్ష్మి వైఎస్సార్ చేయూత పథకాన్ని వివరించి దానికి నేను అర్హురాలినని చెప్పి దరఖాస్తు చేయించారు. అధికారులు నా అర్హతలను గుర్తించి రూ.18 వేలు మంజూరు చేశారు. ప్రస్తుతం ఇంటి వద్ద సిల్వర్ వంటసామగ్రి విక్రయిస్తూ సంతోషంగా జీవిస్తున్నాను. నా కుటుంబ పరిస్థితిని అడిగి తెలుసుకోవడమే కాకుండా చుట్టపక్కల విచారణ చేసి ఈ పథకం అందజేయడంలో ఆమె చేసిన కృషి మరవలేను.

– షేక్ బీబీ, సూర్యనారాయణపురం, కాకినాడ

కుటుంబ సభ్యుడిలా ఉంటున్నారు



మా ప్రాంత వలంటీర్ సాగర్. ఈ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ఒక కుటుంబ సభ్యుడిగా ప్రతి నెలా పింఛన్‌తో పాటు సచివాలయం పరంగా ఏ పని కావాలన్న చేసిపెడుతున్నారు. ఇంటి వద్దకే వచ్చి ఈకేవైసీ వంటి వాటితో పాటు అన్ని రకాల సేవలు అందిస్తున్నారు. పథకాలకు అవసరమయిన అర్హతలను బట్టి మాకు వచ్చేలా చేస్తున్నాడు. ముఖ్యంగా కరోనా సమయంలో ఎవ్వరూ బయటకు రాని సమయంలో అందించిన సేవలు మరువలేనివి. కుటుంబ సభ్యులే దూరంగా ఉంటున్న ఈ రోజుల్లో వారి ద్వారా సాయం పొందగలుగుతున్నాం.

–డి.సూర్యనారాయణ, పేర్రాజుపేట, చింతావారి వీధి

వారి సేవలు మరువలేనివి



కరోనా సమయంలో బంధువులెవరూ ఎలా ఉన్నావో అని కూడా పలుకరించేవారు కాదు. కానీ మా వలంటీర్ కమల మాత్రం తరచూ వచ్చి యోగక్షేమాలు అడిగి తెలుసుకునేది. నాకు చేయూత పథకం ద్వారా లబ్ధి వచ్చేలా చేయడంతో ఏటా రూ.18,500 పొందుతున్నా. మాకు రేషన్‌కార్డు లేదు. గతంలో ఎన్నో సార్లు దరఖాస్తులు పెట్టుకున్నా ఇవ్వలేదు. వలంటీరు ద్వారా మాకు రేషన్‌కార్డు వచ్చింది. మా కోడలికి విద్యాదీవెన పథకం వచ్చిందంటే అది కేవలం వలంటీరే మాకు ఎలా దరఖాస్తు చేయాలో తెలియకున్నా అన్నీ చెబుతుంది. ఆదాయ, కుల, ధ్రువీకరణ పత్రాలు కూడా ఇంటి వద్దకే తెస్తుంది. ఆమె సేవలు మేము ఎప్పటికీ మరువలేం.

– మట్టపర్తి కుమారి, 49వ డివిజన్, విద్యుత్‌నగర్

ప్రభుత్వ సేవలన్నీ అందజేస్తున్నారు



నాలుగేళ్లుగా ఇంటి వద్దకే వచ్చి ప్రభుత్వ సేవలన్నీ వలంటీర్లే అందిస్తున్నారు. అమ్మ ఒడి, వాహన మిత్ర ద్వారా మా కుటుంబం లబ్ధి పొందింది. మా పరిధిలోని వలంటీర్ చంద్ర ఇంటికి వచ్చి ప్రభుత్వం అందించే పథకాలు వివరిస్తూ మా అర్హతలను బట్టి దరఖాస్తు చేయించి అందజేస్తున్నారు. ఇటీవల జగనన్న సురక్ష కార్యక్రమంలో ద్వారా కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలు అందించేందుకు కృషి చేసింది. వలంటీర్ల సేవలను పవన్ కల్యాణ్ విమర్శించడం సరికాదు.

– వెలిశెట్టి గంగాభవాని, రమణయ్యపేట సచివాలయం–1, కాకినాడ రూరల్

కురసాల, ద్వారంపూడి మంచిగా పనిచేస్తున్నారు


డాక్టర్ పితాని అన్నవరం

కాకినాడ రూరల్: పేదలకు మంచి జరిగేలా ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి మంచిగా పని చేస్తున్నారని వైఎస్సార్ సీపీ నేత డాక్టర్ పితాని అన్నవరం అన్నారు. నేమాం, తిమ్మాపురం, చొల్లంగిల్లో వారు అనేక మంది పేదలకు ఇళ్ల పట్టాలు ఇప్పించారన్నారు. 2024లో మళ్లీ మా పార్టీ అధికారంలోకి వస్తుందని పితాని అన్నారు. రమణయ్యపేటలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ డాక్టరు పితాని అన్నవరం చారిటబుల్ ట్రస్ట్ ద్వారా సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని, దీనికి పార్టీకి సంబంధం లేదని ఇది తన వ్యక్తిగతమన్నారు. ఈనాడులో మంగళవారం తాను చెప్పినట్టు నియంతల్లా విర్రవీగవద్దని ఒక కథనం వచ్చిందని, ఈనాడు రాతలు పిచ్చి రాతలన్నారు. సమాజంలో టీడీపీ నాయకులే నియంతలు అన్నారు. పేద ప్రజలకు ఏది అవసరమో అది సీఎం జగన్ చేస్తున్నారన్నారు. మా పార్టీకి సంబంధం లేని వ్యక్తిపై తాను చేసిన వ్యాఖ్యలను ఈనాడు వక్రీకరించిందన్నారు. పార్టీలో మాకు ఎటువంటి మనస్పర్థలు లేవన్నారు.

పవన్‌కల్యాణ్ వ్యాఖ్యలు బాధాకరం


వెంకటలక్ష్మి

కాకినాడ: సేవాభావంతో పనిచేస్తున్న వలంటీర్లపై జనసేన అధినేత పవన్‌కల్యాణ్ అసత్య ఆరోపణలు చేయడం తగదని కాకినాడ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పసుపులేటి వెంకటలక్ష్మి పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ వలంటీర్లపై చేసిన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకుని క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రతి కుటుంబంలో సభ్యుల్లా మమేకమై పనిచేస్తున్న వలంటీర్లను కించపరచడం ఎంతమాత్రం సమంజసం కాదని ఆమె పేర్కొన్నారు. రాజకీయ ప్రయోజనాల కోసమో, వేరొకరి మెప్పుకోసమో వలంటీర్ల మనోభావాలు దెబ్బతినేలా మాట్లాడడం పవన్‌కల్యాణ్‌కు తగదన్నారు.

వలంటీర్ల సేవలు నిరుపమానం

- ఎవరేమన్నా ముందుకెళ్లండి
- మీ వెన్నంటే ఉంటాం
- ఎమ్మెల్యే కన్నబాబు సంఘీభావం


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కన్నబాబు

కరప: ప్రభుత్వ గౌరవవేతనం ఎంతన్నది ఆశించకుండా, నిస్వార్థంగా సేవలందిస్తున్న గ్రామ వలంటీర్లు సేవలు నిరుపమానమైనవని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కురసాల కన్నబాబు పేర్కొన్నారు. వలంటీర్ వ్యవస్థ, మహిళలపై అవగాహన లేకుండా పవన్‌కల్యాణ్ చేసిన అనుచిత వ్యాఖ్యలు ఖండిస్తూ, వలంటీర్లకు సంఘీభావం తెలిపేందుకు స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం సమావేశం ఏర్పాటుచేశారు. సీఎం జగన్ అధికారంలోకి వచ్చాక సచివాలయం, వలంటీర్ల వ్యవస్థలను తీసుకువస్తే, ఎంతో అనుభవం ఉందని చెప్పుకునే చంద్రబాబు హేళనచేసి మాట్లాడారని, ఆ వ్యవస్థలే ఇప్పుడు దేశంలో ఆదర్శంగా నిలిచాయన్నారు. కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అందించిన సేవలు ఎవరూ మరువరన్నారు. గడప గడపకూ మనప్రభుత్వం కార్యక్రమంలో ఇంటింటికీ వెళ్లినప్పుడు ప్రభుత్వ సేవలే కాదు, సొంత పనులు కూడా చేసిపెడుతున్న వలంటీర్లు పిల్లలు దగ్గరలేని లోటు తీరుస్తున్నారని ప్రజలు చెపుతుంటే గర్వంగా ఉందన్నారు. ఉమెన్ ట్రాఫికింగ్‌లో దేశంలో మనరాష్ట్రం 11వ రాష్ట్రంలో ఉందని, ముందున్న రాష్ట్రాల్లో ఎవరు చేయిస్తున్నారని ఆయన ప్రశ్నించారు. వలంటీర్లు రాకముందు 2019లో ఎన్నికేసులున్నాయి, ఇప్పుడు ఎన్ని కేసులున్నాయో పరిశీలించాలన్నారు. మీరు చేస్తున్న సేవలకు హేట్సాఫ్ చెప్తున్నా, అధైర్యపడకుండా, ఆత్మాభిమానంతో ముందుకెళ్లండన్నారు. సంతృప్తికరంగా సేవలందిస్తున్న మీ వెనక సీఎం జగన్, మేము ఉంటాం అని వలంటీర్లకు ఎమ్మెల్యే కన్నబాబు సంఘీభావం తెలిపారు. జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, సర్పంచ్ సాదే ఆశాజ్యోతి, వైఎస్సార్‌సీపీ నాయకులు పెంకే సత్తిబాబు, గోపిశెట్టి బాబ్జీ, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష ధ్రువపత్రాల పంపిణీ

కాకినాడ రూరల్: మండలంలోని రమణయ్య పేట పంచాయతీ కార్యాలయం వద్ద మంగళవారం జగనన్న సురక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కురసాల కన్నబాబు ముఖ్య అతిథిగా పాల్గొని దరఖాస్తుదారులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారన్నారు. ఎంపీడీఓ స్వప్న, జెడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ, ఏఎంసీ చైర్మన్ గీసాల శ్రీను, సీనియర్ నాయకుడు గోపుశెట్టి బాబ్జీ, గీసాల శ్రీనివాసరావు, రమణయ్యపేట సచివాలయం – నాయకుడు, మండల సేవాదళ్ అధ్యక్షుడు మోకా కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.


లబ్ధిదారులకు ధ్రువపత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే కురసాల కన్నబాబు

'లావణ్య'కు పునర్జన్మ

పదమూడేళ్ల బాలిక ప్రాణాలు నిలిపిన జీజీహెచ్ వైద్యులు


బాలిక లావణ్యతో వైద్య బృందం

కాకినాడ క్రైం: ప్రాణాపాయ స్థితికి చేరిన బాలికకు జీజీహెచ్ వైద్యులు పునర్జన్మనిచ్చారు. సూపరింటెండెంట్ డాక్టర్ హేమలతాదేవి మంగళవారం మీడియాకు వెల్లడించిన వివరాల మేరకు, శ్రీకాకుళానికి చెందిన 13 ఏళ్ల లావణ్య మలద్వారం లేకుండా పుట్టింది. పుట్టినప్పుడే ఇక్కడి జీజీహెచ్‌లో సర్జరీ చేశారు. కొన్నేళ్ల క్రితం ఈమెకు చిన్నపేగు సమస్య ఎదురైతే శ్రీకాకుళంలో శస్త్రచికిత్స నిర్వహించారు. ఆ వైద్యులు చేసిన చిన్న పొరపాటు బాలికను ప్రాణాంతక స్థితికి నెట్టింది.

ఆమె తండ్రి ఆటో డ్రైవర్. విషమ స్థితిలో లావణ్యను గత నెల 6న జీజీహెచ్‌లో చేర్చారు. ఆహారం మలంగా మారి ఇన్ఫెక్షన్‌కు దారి తీసి శరీరంలో సత్తువ మొత్తాన్ని హరించేసింది. ఈ నేపథ్యంలో సర్జన్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.శ్రీనివాస్ ఆధ్వర్యంలోని బృందం వైద్య సేవలు మొదలు పెట్టింది. రోజుకు రూ.15 వేలు ఖర్చు అయ్యే పోషకాహారాన్ని అందజేశారు. అలా నెల రోజుల పాటు వైద్య సేవలు కొనసాగించారు. లావణ్య కోలుకుంది. వ్యర్థాలు మలద్వారం గుండానే వెళ్లాయి. ఆహారం తీసుకుంటోంది. మంగళవారం బాలికను డిశ్చార్జి చేశారు. బాలిక ప్రాణాలు నిలపడంలో సర్జరీ అసోసియేట్ డాక్టర్ మైథిలి, అసిస్టెంట్లు డాక్టర్ సాగర్, డాక్టర్ హారిక, పీజీలు డాక్టర్ దేవా, డాక్టర్ శివ, డాక్టర్ శ్రీధర్‌లు కీలకంగా వ్యవహరించారు. టోటల్ పేరెంట్రల్ న్యూట్రీషన్ ద్వారా సుమారు నెల రోజుల పాటు ఘనాహారం ఇవ్వకుండా కేవలం ద్రవ పోషకాల ద్వారా మాత్రమే వైద్య సేవలు కొనసాగాయన్నారు. ఇదే వైద్యం కార్పొరేట్ ఆసుపత్రిలో చేయించుకునేందుకు సుమారు రూ.8 లక్షలు ఖర్చవుతుందని డాక్టర్ హేమలతాదేవి తెలిపారు. డాక్టర్ శ్రీనివాస్ బృందాన్ని ఆమెతో పాటు, డీసీఎస్ ఆర్ఎంవో డాక్టర్ అనిత అభినందించారు.

ఆకట్టుకుంటున్న వస్త్ర ప్రదర్శన


ప్రదర్శనలో వస్త్రాలు కొనుగోలు చేస్తున్న మహిళలు

బోట్‌క్లబ్: స్థానిక నాగమల్లితోట జంక్షన్ వద్దనున్న ద్వారంపూడి భాస్కర్‌రెడ్డి, పద్మావతి కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన వసుధ ఫ్యాషన్, లైఫ్‌స్టైల్ ఎగ్జిబిషన్ నగర మహిళలను ఎంతగానో ఆకట్టుకుంటోంది. నిర్వాహకులు ప్రవీణ్‌కుమార్, సీతాకాంత్ మాట్లాడుతూ గృహిణులు, మహిళలు, విద్యార్థినులకు ఉపయోగపడేలా దేశ నలుమూలలు నుంచి ప్రఖ్యాతిగాంచిన సుమారు 50 పైగా డిజనర్లు రూపొందించిన వస్త్రాలను ప్రదర్శనలో ఉంచామన్నారు. ముంబయి, ఢిల్లీ, అహ్మదాబాద్, జైపూర్, కోల్‌కత్తా, మధ్యప్రదేశ్, చెన్నై, హైదరాబాద్ నగరాలు నుంచి ప్రముఖ డిజైనర్లు తీసుకొచ్చి నగర ప్రజలకు లేటెస్ట్ డిజైనర్ వస్త్రాలు పరిచయడం చేసినట్లు తెలిపారు. ఈ ప్రదర్శన ఈ నెల 13వ తేదీ రాత్రి 9 గంటలు వరకూ ఉంటుందన్నారు. నగర ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పర్యావరణ సమతుల్యతను కాపాడాలి

ఆచార్య ఆలపాటి శ్రీనివాస్


పర్యావరణ సమతుల్యతపై మాట్లాడుతున్న ప్రొఫెసర్ ఆలపాటి శ్రీనివాస్

కాకినాడ రూరల్: ఐక్యరాజ్యసమితి నిర్దేశకాలను అనుసరించి జనాభా పెరుగుదలకు అనుగుణంగా ప్రపంచ పర్యావరణాన్ని కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆచార్య ఆలపాటి శ్రీనివాస్ అన్నారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఎంఎస్ఎన్ క్యాంపస్ కాకినాడలో ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా 'ప్రపంచ జనాభా పెరుగుదల, వాటి ప్రభావాలు' అనే అంశంపై ఇంచార్జి ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.పోచయ్య అధ్యక్షతన క్యాంపస్ ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. శ్రీనివాస్ ముఖ్య అతిథిగా మాట్లాడుతూ జనాభా పెరుగుదల మానవాళికే కాకుండా జీవరాశులకు, పర్యావరణానికి సంబంధించిన అంశమని, అసమానతలను పారదోలి ఉన్నతమైన సంఘాన్ని ఏర్పరచాలని కోరారు. ఎన్ఎస్ఎస్ అధికారులు డాక్టర్ ఎం నానిబాబు, డాక్టర్ ఎం శ్రీదేవి, అధ్యాపకులు డాక్టర్ స్టీఫెన్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిక్షణకు కృషి చేయాలి

పర్యావరణ పరిక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రోటరీ క్లబ్ అధ్యక్షుడు కాశీవిశ్వనాథ్ గోపు పిలుపునిచ్చారు. క్లబ్ కాకినాడ డీజీఎన్ డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి సహకారంతో సమకూర్చిన 40 కొబ్బరి మొక్కలను మండలంలోని ఇంద్రపాలెం కాల్వగట్టులో మన ఊరు మన బాధ్యతగా పార్కులో నాటారు. క్లబ్ సెక్రటరీ బాబీ, మాజీ గవర్నర్ టిక్కు ముఖ్య అతిథిగా, డీజీఎన్ డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి విశిష్ట అతిథిగా, అసిస్టెంట్ గవర్నర్ తాడాల వరప్రసాద్ గౌరవ అతిథిగా పాల్గొన్నారు.

అభివృద్ధి ద్వారా సమాజ సేవకు శ్రీకారం


బాలకృష్ణను సత్కరిస్తున్న క్లబ్ సభ్యులు

బోట్‌క్లబ్: రోటరీ బ్లడ్‌బ్యాంక్ అభివృద్ధిలో టీవీ బాలకృష్ణ చేసిన కార్యక్రమాలు మరువలేనివని రోటరీ గోల్డెన్ జూబ్లీక్లబ్ మాజీ అధ్యక్షుడు జీవీ కృష్ణ ప్రకాష్ అన్నారు. స్థానిక రోటరీహాల్‌లో మంగళవారం 2022– 23 సంవత్సరంలో బ్లడ్‌బ్యాంక్ చైర్మన్‌గా సేవలందించిన బాలకృష్ణను సత్కరించారు. బాలకృష్ణ మాట్లాడుతూ బ్లడ్‌బ్యాంక్‌లో అత్యాధునిక వైద్య పరికరాలు ఏర్పాటుతో పాటు రోగులకు వీలుగా లిఫ్ట్ ఏర్పాటు చేయడంలోను క్లబ్ సభ్యులు అందించిన సహకారం ఎంతో ఉందన్నారు. మాజీ గవర్నర్ ఎస్‌వీఎస్‌రావు, క్లబ్ సభ్యులు చార్మినార్ వర్మ, ధనసాగర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

టీడీఆర్ బాండ్ల జారీకి పరిశీలన


టీడీఆర్ బాండ్ల జారీపై క్షేత్రస్థాయి పరిశీలన చేస్తున్న కమిషనర్ డాక్టర్ మహేష్‌కుమార్

కాకినాడ: కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ డాక్టర్ మహేష్‌కుమార్ మంగళవారం వివిధ ప్రాంతాల్లో పర్యటించారు. కార్పొరేషన్ తరపున టీడీఆర్ బాండ్లకు సంబంధించి వివేకానందపార్కు, మసీదు సెంటర్ ప్రాంతాల్లోని స్థలాలను పరిశీలించి అధికారులతో చర్చించారు. టీడీఆర్ బాండ్లు జారీ చేసే అంశంపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం 20వ డివిజన్ మహాలక్ష్మినగర్ ప్రాంతంలో జరిగిన సర్వేలో పాల్గొన్నారు. ఆయన వెంట డిప్యూటీ సిటీ ప్లానర్ హరిదాసు, ఏసీపీ నాగశాస్త్రులు, టౌన్ సర్వేయర్ సీతారామాచార్యులు, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

నెహ్రూయువ కేంద్ర ఇండియా పోటీల్లో ప్రతిభ

బాలాజీచెరువు: ఏఎస్‌డీ ప్రభుత్వ కళాశాలలో నెహ్రూ యువకేంద్ర–ఇండియా నిర్వహించిన జిల్లా స్థాయి పోటీలో ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థి ప్రతిభ చూపింది. డిగ్రీ విద్యార్థి చరిష్మ పంచ్‌ప్రాణ్ ఆఫ్ అమ్రిత్ కాల్ అంశంపై ప్రసంగించి మొదటి బహుమతితో పాటు రూ.5 వేలు నగదు బహుమతి సాధించింది. చరిష్మను కళాశాల ప్రిన్సిపాల్ కరుణ, అధ్యాపకులు అభినందించారు.

ప్రత్యేక అలంకరణలో మరిడమ్మ తల్లి



పెద్దాపురం: జాతర ఉత్సవాల్లో భాగంగా పెద్దాపురం మరిడమ్మ అమ్మవారిని మంగళవారం ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీ, ఈఓ సీహెచ్ రామ్మోహనరావుల ఆధ్వర్యంలో వేద పండితులు అమ్మవారికి పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

పవన్ క్షమాపణ చెప్పాల్సిందే

బోట్‌క్లబ్: ప్రజలకు ఎంతో సేవ చేస్తున్న వలంటీర్లకు జనసేన అధినేత పవన్ కల్యాణ్ క్షమాపణ చెప్పాలిందేనని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు చిట్నీడి శ్రీనివాస్ మంగళవారం డిమాండ్ చేశారు. నడవలేని స్థితిలో ఉన్నవారికి ప్రతి నెలా పింఛను ఇవ్వడంతో పాటు వారికి అందిస్తున్న సేవలు మరువలేనివన్నారు. పవన్‌కల్యాణ్ వలంటీర్ల సేవలను తప్పుపట్టడం సిగ్గుచేటన్నారు. కేవలం రాజకీయ లబ్ధి కోసం ఏదో మాట్లాడాలని వలంటీర్లపై నోరు పారేసుకోవడం తగదని హితవు పలికారు.

జగనన్న సురక్షతో ప్రజలచెంతకే ప్రభుత్వ సేవలు


దరఖాస్తుదారుకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న అధికారులు, నాయకులు

కరప: మండలంలోని వేళంగి సచివాలయం–2లో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ సవిలే నీలిమ కార్యక్రమాన్ని ప్రారంభించి ప్రభుత్వం ఉచితం అందజేస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు సూచించారు. అనంతరం అధికారులతో కలసి 750 మందికి వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఎంపీటీసీ సభ్యుడు ముషిని సూరిబాబు, ఉపసర్పంచ్ కుంచే అయ్యన్న, ఎంపీడీఓ కె.అప్పారావు, డీటీ కె.అనిల్‌కుమార్, ఈఓ పీఆర్డీ ఎస్‌వీ శ్రీనివాసరావు, గ్రామ కార్యదర్శి పి.శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ నాయకులు సవిలే రాజేష్, సానా శ్రీను తదితరులు పాల్గొన్నారు.